క్లుప్తంగా

పూర్వ విద్యార్థులకు ఆర్థికసాయం



పూర్వ విద్యార్థి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కపిలేశ్వరపురం: టేకిలోని శ్రీజోసఫ్ వీరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 1994–95 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సామాజిక సేవా కార్యక్రమం చేపట్టారు. ఆ బ్యాచ్‌లో ఆర్థికంగా వెనుకబడిన ఐదు కుటుంబాలకు రూ.50 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందించారు. పూర్వ విద్యార్థి, ఎన్టీపీసీ ఇంజినీర్ గుత్తుల వీరభద్రరావు ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాన్ని గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాస్, కె.వరప్రసాద్, వి.సుబ్రహ్మణ్యం, వి.శేషు కుమార్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

కె.గంగవరం: మండలంలో నేటితో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ముగియనున్నాయని ఎంపీడీఓ ఎన్.శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరిగా నేడు మండల పరిధిలోని యర్రపోతవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి స్థానికంగా గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైద్యులు అందుబాటులో ఉంటారని సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరం వద్ద రక్త పరీక్షలతో పాటు పలు పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందిస్తారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అప్పులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు దాతలు నిత్యావసరాలు పంపిణీ చేశారు. మండలంలోని పేకేరు భీమ్‌నగర్‌కు చెందిన వినకోటి చిన సత్తిబాబు, బాలాంత్రం గ్రామానికి చెందిన గొల్ల రామ్మోహన్‌రావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో జనసేన నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరపున బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.

ఢిల్లీకి తరలిన బీజేపీ నేతలు



మట్టి కలశాలతో బీజేపీ నాయకులు

మండపేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అమృత కలశాలతో మండపేట నుంచి బీజేపీ నాయకులు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశం నలుమూలల నుంచి సేకరించిన పవిత్ర మట్టిని ఢిల్లీలోని అమరవీరుల స్థూపం వద్ద ఉంచాలన్న ప్రధాని సూచన మేరకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పవిత్ర మట్టిని సేకరించారు. మట్టితో నింపిన అమృత కలశాలతో ఆదివారం బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ కేవీవీ సాయిరాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గొడవర్తి రామచంద్రరావు, సూరంపూడి సత్యనారాయణ, నామాల శ్రీనివాస్, పిల్లా సురేష్, నరేష్ కుమార్ తదితరులు విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీకి తరలివెళ్లారు.

టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

రామచంద్రపురం: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నియోజకవర్గ పార్టీ విస్తృత స్థాయి సమావేశం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోని ఇంటింటికీ వెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను వారికి అందించాలని మండల పార్టీ కన్వీనర్లకు, క్లస్టర్ ఇంచార్జిలకు, యూనిట్ ఇంచార్జిలకు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ ప్రెసిడెంట్లకు, నాయకులకు, కార్యకర్తలకు సూచనలు చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేటలో టీడీపీ నిరసన

మండపేట: మాజీ సీఎం చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాత్రి మండపేటలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. స్థానిక రథం సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ చంద్రబాబుపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయించిందని ఆరోపించారు.

గోడు వింటూ.. సమస్యలు పరిష్కరిస్తూ..

మంత్రి వేణు గుడ్ మార్నింగ్



పూడిక తీస్తున్న పారిశుధ్య కార్మికుడితో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: పురపాలక పరిధిలో రోజూ గుడ్ మార్నింగ్ రామచంద్రపురం అంటూ రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి పట్టణ వాసులను పలకరిస్తూ ప్రజల గోడు వింటూ సమస్యల పరిష్కార వేదికగా గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత రెండు నెలలుగా పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ తన అనుచరులు, మున్సిపాలిటీ అధికారులతో కలసి ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పర్యటిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం 22వ వార్డులో పర్యటించారు. ఎన్నికలకు ముందు మంత్రి వేణు అన్ని వార్డులను గుడ్ మార్నింగ్ కార్యక్రమం ద్వారా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అధికారం వచ్చిన తరువాత తాను గుడ్ మార్నింగ్‌లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. గతంలో పట్టణంలోని 28 వార్డుల్లోను డ్రైనేజీ, తాగునీటి సమస్యలను అధికంగా ఉండేవి. గుబ్బలవారిపేట, స్టీల్‌విల్‌పేట, తోటవారివీధి, బ్రాడీపేట, హౌసింగ్ బోర్డు కాలనీల్లో గతంలో వచ్చిన సమస్యలను పరిష్కరించారు. డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం చేశారు. ప్రధాన డ్రైన్లు పూడుకుపోవడంతో ప్రధాన రహదారిలోని రెండు వైపులా డ్రైన్లలో పూడికతీత పనులను చేయించారు. తిరిగి మరలా ఇటీవల గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిరవధికంగా కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని పార్కుల అభివృద్ధికి మంత్రి వేణు మున్సిపాలిటీ అధికారులను ఆదేశించి ప్రణాళికలను తయారు చేయమన్నారు. పట్టణంలో స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలను తీసుకున్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు గ్రౌండ్‌లో పర్యటించి ఉదయం పూట గ్రౌండ్‌లో నడిచే వారికి ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా చూడాలని మంత్రి వేణు ఆదేశించారు. బ్రాడీపేటలో డ్రైనేజీలు మూసుకుపోవటంతో వాటిని వెంటనే పరిష్కరించి మురుగునీటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్రాడీపేటలోని ఒక వృద్ధురాలు రోడ్డు మీద పాలు తీసుకుని వెళుతుండగా ఆమెను క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ సేవా, స్వచ్ఛ, స్వేచ్ఛ రామచంద్రపురంలో భాగంగా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరం ఉందన్నారు. పట్టణాన్ని సుందరీకరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణ పౌరులకు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డీఈ డి.దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్‌రాజు, ఎలక్ట్రికల్ ఏఈ ఎంవీ రమణ, కౌన్సిలర్ కేతా శ్రీను, పట్టణ పార్టీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కంచుమర్తి బాబూరావు, కలిదిండి శ్రీను, దొమ్మలపాటి సత్యనారాయణ, దిగుమర్తి వీరబాబు, కొండేపూడి సురేష్, మల్లిడి సత్తిరెడ్డి, కోటి దుర్గారావు, గుబ్బల రాంబాబు, దార్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటం



గుంటూరు తరలివెళ్లిన ముస్లింలు

మండపేట: తమ హక్కుల సాధన కోసం అవిశ్రాంత పోరాటం చేస్తామని నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ సుభాన్ అన్నారు. గుంటూరులోని ఆంధ్రా ముస్లిం కాలేజీ వద్ద నిర్వహించనున్న నూర్ బాషా సింహ గర్జనకు ఆదివారం మండపేట నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. షేక్ సుభాన్ జెండా ఊపి గర్జన యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 15 బస్సులు, 20 కార్లలో సభకు తరలివెళుతున్నట్టు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ముస్లింలు వెళుతున్నారన్నారు. ఇబ్రహీం మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల జనాభా ఉన్న నూర్‌బాష్ దూదేకులకు ఎలాంటి రాజకీయ గుర్తింపు ఆదరణ లేదన్నారు. సామాజిక వెనకబాటు తనంతో హక్కులను పొందలేక పోతున్నారన్నారు. చట్ట సభల్లో ప్రాతినిధ్యంతో పాటు తమ సంఘానికి కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి సంక్షేమ ఫలాలు అందజేయాలని కోరారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



గొల్లపాలెం కాకినాడ, కోటిపల్లి రహదారిలో వేగంగా వెళుతున్న ట్రాక్టర్‌పై సెల్‌ఫోన్ చూసుకుంటున్న యువకులు

కాజులూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వాలు ఎన్ని కట్టుదిట్టమైన చట్టాలు తీసుకువస్తున్నా పలువురు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తూనే ఉన్నారు. కాకినాడ, కోటిపల్లి రహదారిలో ఆదివారం గొల్లపాలెం వద్ద ఒక రైతు ట్రాక్టర్‌పై తీసుకు వెళుతున్న ఎరువుల బస్తాలపై ఇద్దరు యువకులు సెల్ ఫోన్ చూసుకుంటూ ఇలా నిర్లక్ష్యంగా కూర్చున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. అసలే ప్లాస్టిక్ సంచులతో కూడిన బస్తాలు పొరపాటున ట్రాక్టర్ డ్రైవరు షడన్ బ్రేకు వేస్తే ఇక యువకులు జర్రున జారిపడక తప్పదు. ఆ సమయంలో వెనుకనే మరేదైనా పెద్ద వాహనం వస్తే అంతే సంగతులు. మిత్రమా అజాగ్రత్త ప్రయాణం ప్రాణాలకే ప్రమాదం.

ఉచిత నేత్ర పరీక్షలు



కోలంకలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాజులూరు: కోలంక మండల పరిషత్ పాథమికోన్నత పాఠశాలలో ఆదివారం స్థానిక వెంకట నరసింహ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 300 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొండా వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి చెందిన పలువురు వైద్యులు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించారు. పలువురికి శస్త్ర చికిత్స అవసరం కాగా వారిని కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని బొండా వెంకన్న తెలిపారు.

అముజూరులో..

కె.గంగవరం: మండలంలోని అముజూరు సాయిబాబా ఆలయం వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొల్లుకు చెందిన కంటి వైద్య నిపుణులు ఉదయం 9 గంటల నుంచి ఉచితంగా పరీక్షలు చేసిన మందులు అందిస్తారన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి పాలకొల్లులో గల కంటి ఆసుపత్రి వద్దకు తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని, గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ఎస్‌పీవీఆర్ హైస్కూల్ యాజమాన్యం వైఖరిపై నిరసన



ద్రాక్షారామలో నిరసన కార్యక్రమంలో మాగాపు అమ్మిరాజు తదితరులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పీవీఆర్ హైస్కూల్ యాజమాన్యం నిరంకుశ వైఖరి అవలంబిస్తున్నారంటూ న్యాయవాది మాగాపు అమ్మిరాజు నేతృత్వంలో ఆదివారం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ సమీపంలో నిరసన దీక్ష చేపట్టారు. యాజమాన్యం ఎయిడెడ్ పాఠశాలను తిరిగి తెరిపించాలని, తమపై కేసులు పెట్టిన యాజమాన్యం నిరంకుశ వైఖరి నశించాలని నినాదాలు చేశారు. ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాశ్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్, తెలుగు దేశం నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషం పాల్గొన్నారు. అనంతరం పోలీసులు దీక్షా శిబిరాన్ని తొలగించి నిరసనకారులను ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హైస్కూల్ సమస్యను మంత్రి పరిష్కరిస్తామన్నారు: వైస్ ఎంపీపీ శాకా బాబీ

ద్రాక్షారామలోని పీవీఆర్ హైస్కూల్ సమస్యను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరిష్కరిస్తామన్నారని రామచంద్రపురం మండల వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ) అన్నారు. ఈ మేరకు శాకా బాబీ ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. హైస్కూల్ సమస్యపై తమను మంత్రి వేణు వద్దకు తీసుకుని వెళ్లమని అనిశెట్టి చంటి, ముప్పనపల్లి పద్దయ్య, రిమ్మలపూడి సతీష్, గాదంశెట్టి సతీష్ తదితరులు కోరడంతో శనివారం మంత్రి వేణు వద్దకు తీసుకుని వెళ్లామన్నారు. స్కూలు, గ్రౌండ్ విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ట్రస్ట్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని మాటిచ్చారని తెలిపారు.

ముగిసిన కబడ్డీ లీగ్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న కబడ్డీ లీగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. గత 15 రోజులు నిర్వహించిన ఈ పోటీలలో విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. పట్టణంలోని పిల్లా వారి జట్టు ట్రోఫీ విజేతగా నిలిచింది. ద్వితీయస్థానం కేవీఆర్ జట్టు, తృతీయస్థానం ఎస్‌కేపీహెచ్ జట్టు కై వసం చేసుకున్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు కేవీఆర్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కె.నాగసతీష్‌కుమార్ క్రీడా దుస్తులను అందజేశారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తల్లి భానుమతి జ్ఞాపకార్థం క్రీడాకారులకు బహుమతులు అందించారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్, డాక్టర్ పి.ఆనంద్, డాక్టర్ టి.శివచంద్, డాక్టర్ రఘువీర్‌కాంత్, డాక్టర్ జయలక్ష్మి కౌన్సిలర్లు తోట అమ్మాజీ, కేతా సుజాత తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పీడీలు ఎం.అప్పన్న, ఎస్.శ్రీనివాస్, నాగార్జున, ఆనె శ్రీనివాస్, ఎస్.సత్యనారాయణ, బి.అప్పాజీ, ఏవీవీ సత్యనారాయణ కె.శ్రీనివాస్‌లు పోటీలను పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



చెముడులంకలో నాటి గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆలమూరు: నాలుగు దశాబ్దాల క్రితం చదువుకున్న విద్యార్థులందరూ ఒక వేదికపై కలుసుకుని ఆలింగనం చేసుకుంటూ అనురాగం, ఆప్యాయతలను పంచుకున్నారు. ప్రస్తుతం పెద్ద తరహా జీవన శైలిని అనుభవిస్తున్న వారంతా ఒక్కసారిగా విద్యార్థి దశలోని యవ్వన ప్రాయానికి వెళ్లిపోయారు. జ్ఞాపకాల దొంతరలను నెమరువేసుకుని నాటి చిలిపి అల్లరిని, గురువులుతో తిన్న చీవాట్లను గుర్తుకు తెచ్చుకున్నారు. మండలం చెముడులంక ఎస్టీఎస్ఎన్ఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1977–82 మధ్య కాలంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. సుమారు 47 మంది విద్యార్థుల్లో దాదాపు 40 మంది నాటి విద్యార్థులు కుటుంబ సభ్యులతో వచ్చి అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్నారు.

గురువులకు ఘన సత్కారం

నాడు విద్యా బోధన చేసి జీవితానికి బాట వేసిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. విలువలతో కూడిన విద్యను అందించి తమ ఉన్నతికి విశేష కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు గన్ని ప్రసాద్, రామలింగేశ్వరరావు, కీర్తి రామం తదితరులకు పూలమాలలు వేసి దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించి మెమెంటోను బహూకరించారు. తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేశారు.

అయినవిల్లి.. ఆధ్యాత్మికతతో శోభిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తుల రద్దీ

అయినవిల్లి: సకల శుభాలివ్వు విఘ్నేశ్వరా అంటూ ఆ గణనాథుడిని భక్తజనం కొలిచింది. అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఉదయం ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి మేలుకొలుపు సేవ చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. గరిక పూజ, పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 65 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 185 మంది, నూతన వాహన పూజ ఆరుగురు జరిపించుకున్నారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,05,236 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

వైభవంగా దుర్గమ్మ ప్రతిష్ఠా మహోత్సవం



పెదపట్నంలంకలో జరిగిన ఘటాభిషేకంలో పాల్గొన్న ముత్తైదువలు

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ 32వ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి ఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. సుమారు 116 మందికి పైగా ముత్తైదువలు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. పెదపట్నం గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ గంటి శ్రీనివాసు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ అమ్మవారి ఆలయం వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచనం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి వెళ్లారు. అక్కడ గోదావరి నదీ తీరంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపించారు. తదుపరి కనకదుర్గమ్మకు లక్ష కుంకుమార్చన, లలితా హోమం నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది.

మార్షల్ ఆర్ట్స్‌లో అన్విష్ వర్మకు బంగారు పతకం

మలికిపురం: కెనడాలోని కాల్గరీలో ఈ నెల 16 నుంచి 22 వరకూ జరిగిన ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్‌లో మలికిపురానికి చెందిన భూపతిరాజు అన్విష్ వర్మ బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఈ మేరకు కెనడా నుంచి వర్మ విలేకరులతో మాట్లాడారు. 2018లో గ్రీస్ ప్రపంచ చాంపియన్ షిప్‌లో, 2019లో ఆస్ట్రియాలో జరిగిన ప్రపంచ చాంపియన్ షిప్‌లో బంగారు పతకాలు సాధించానన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశం తరఫున పాల్గొని పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

బాలాజీని దర్శించుకున్న విద్యాశాఖ ఏడీ



అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకుంటున్న విజయలక్ష్మి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం కలిపారు. ఏడీ విజయలక్ష్మి శ్రీదేవి, భూదేవి సమేతం బాలబాలాజీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు కాకినాడ డీఈఓ ఆఫీస్ ఏఎస్ఓ కె.వెంకటేశ్వరరావు, ఏపీఓ వి.సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి కామేశ్వరరావు బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు స్వామి వారి శేషవస్త్రం బహూకరించి, మహాదాశీర్వచనం అందించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యుడు కొమ్ముల సూరిబాబు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ చిక్కం సత్యప్రసాద్, ఉపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ ఉన్నారు.

నేడు ద్వారపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం ద్వారపూడిలో పర్యటించనున్నట్టు గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం వద్ద నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం



ద్రాక్షారామలో ప్రత్యేక అలంకరణలో ఊరేగిస్తున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని ద్రాక్షారామలో వేంచేసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా దసరా మహోత్సవాల అనంతరం మొదటి ఆదివారం అమ్మవారికి నగరోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోంది. దీనిలో భాగంగా వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పచ్చిపూలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఊరేగింపు బ్యాండు మేళాలు, కేరళ నృత్యాలతో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్, సంఘ సభ్యులు, వాసవీ వనితా క్లబ్ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మార్కెట్ వద్ద వేంచేసిన సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద దసరా ముగింపు సందర్భంగా ఆదివారం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

నేడు బాపనయ్యచెరువులో 'స్వచ్ఛత-మన బాధ్యత'

రామచంద్రపురం రూరల్: నేటి ఉదయం 8 గంటలకు రామచంద్రపురం మండలం బాపనయ్యచెరువులో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్వచ్ఛత-మన బాధ్యత కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు ఖండిస్తూ నిరసన

రావులపాలెం: బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లే ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులోని డ్రైవర్ బలరాం సింగ్‌పై కావలి పరిసర ప్రాంతంలో కొందరు ఆకతాయిలు మూకుమ్మడిగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ రావులపాలెం ఆర్టీసీ డిపో జేఏసీ ఉద్యోగులు అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆదివారం నిరసన తెలిపారు. 24 గంటలు నిరంతరం ప్రయాణికుల భద్రత యోగక్షేమాల కోసం శ్రమిస్తూ, ప్రయాణికుల కోసం శ్రమిస్తూ ఉండే ఒక వాహన చోదకుడిపై దాడిని వారు ఖండించారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన అల్లరి మూకలను గుర్తించి అరెస్టు చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. దాడి చేసిన అల్లరి మూకలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని ప్రజల క్షేమమే తమ ధ్యేయంగా భావించే ఆర్టీసీ ఉద్యోగులపై మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు.

రాత్రి వేళల్లో పోలీసుల ప్రత్యేక నిఘా

ఆలమూరు: అసాంఘిక కార్యకలాపాలకు చరమ గీతం పాడేందుకు, దొంగతనాలు అరికట్టి, అల్లరి మూకలను అదుపులో ఉంచేందుకు ఎస్సై ఎల్.శ్రీను నేతృత్వంలో పోలీసు సిబ్బంది రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా నిర్వహిస్తున్నారు. రాత్రి వేళల్లో అనుమానంగా సంచరిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చి జాగ్రత్తలు చెబుతున్నారు. ఆలమూరు ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే వినూత్నమైన రీతిలో నేరాల అదుపుకు కృషి చేస్తున్న పోలీసు సిబ్బందిని ప్రజలు అభినందిస్తున్నారు. వాహనాలు నడిపే వారందరికి తప్పనిసరిగా రికార్డులు సక్రమంగా ఉండాలని, రహదారులపై మద్యం తాగరాదని హెచ్చరిస్తున్నారు. ప్రతి రోజు ముఖ్యకూడళ్లలో పహారా నిర్వహిస్తున్నట్లు ఎస్సై శ్రీను ఆదివారం తెలిపారు.